క్లుప్తంగా

విత్తన దుకాణాల్లో తనిఖీలు



రెడ్డిగూడెం: విత్తనాలను ఎంఆర్‌పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అంతర్గత స్క్వాడ్, జగ్గయ్యపేట సహాయ వ్యవసాయ సంచాలకుడు సీహెచ్ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి ఆర్.సురేష్ ఆధ్వర్యంలో విత్తన దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ (నాగులూరు), శ్రీ సీతారామ మెన్యుర్ (బూరుగగూడెం)లో లైసెన్సులు, స్టాక్ ఇన్వాయిస్‌లు, విత్తనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. విత్తనాల బిల్లులు, లాట్ వివరాలు నమోదు చేయకపోవడంతో రూ.6,65,200 విలువైన విత్తనాల విక్రయాలను నిలుపుదల చేశారు. బిల్లులు సరిగా ఇవ్వకుండా విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి



ఇబ్రహీంపట్నం: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని ఇబ్రహీంపట్నంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి, పార్టీ నాయకులతో కలసి ఆయన చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కూనల యుగంధర్, నాయకులు పాల్గొన్నారు.

సాగుకు రైతులు సమాయత్తం

చాట్రాయి: మారిన వాతావరణంతో కురుస్తున్న వర్షాలకు రైతులు సాగుకు సమాయత్తం అవుతున్నారు. మండలంలో సుమారు 9 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేస్తున్నారు. చాట్రాయి, పోలవరం, బూరుగుగూడెం, జనార్దనవరం, ఆరుగొలనుపేట, సూరంపాలెం, చిన్నంపేట, కోటపాడు గ్రామాల్లో వ్యవసాయ బోరు సదుపాయం ఉన్న రైతులు ముందుగా సిద్ధం చేసుకున్న మడుల్లో వరి నాట్లు వేస్తున్నారు. పొడి దుక్కులు దున్ని పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకున్నారు. సుమారు 250 ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న 450 ఎకరాలు, పెసర 50 ఎకరాల్లో మెట్ట సాగు చేస్తున్నారు. 11 రైతు భరోసా కేంద్రాల్లో యూరియా 91 టన్నులు, డీఏపీ 29.5 టన్నులు, ఎంఓపీ 05 టన్నులు అందుబాటులో ఉన్నాయి. ఆర్‌బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా అందిస్తుండడంతో రైతులు సాగులో బిజీబిజీగా ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మైలవరం: ఐసీడీఎస్ ప్రాజెక్టు మైలవరం పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పుష్పలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం మండలం వెల్వడం-5లో అంగన్‌వాడీ కార్యకర్త జనరల్ కేటగిరీ-1, అంగన్‌వాడీ సహాయకురాలు వెల్వడం-2 జనరల్ కేటగిరీ, అంగన్‌వాడీ సహాయకురాలు మైలవరం-7 జనరల్ కేటగిరీలో ఖాళీలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు తమ దరఖాస్తులను ఈ నెల 14వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా పంపించాలని పేర్కొన్నారు.

వేయి ఎకరాల్లో విత్తనోత్పత్తికి చర్యలు

జి.కొండూరు: ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో వచ్చే ఖరీఫ్ నుంచి రైతుస్థాయిలో విత్తనోత్పత్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని సంస్థ జిల్లా మేనేజరు జె.అనిత తెలిపారు. విత్తనోత్పత్తి ముందస్తు ప్రణాళికలో భాగంగా కుంటముక్కల పంచాయతీ కార్యాలయంలో గురువారం రైతు సదస్సును నిర్వహించారు. అనిత మాట్లాడుతూ.. ఇంద్ర ఎంటీయూ 1061 వరి వంగడాన్ని ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో విత్తనోత్పత్తి చేసేందుకు జి.కొండూరు మండలంలోని కుంటముక్కల, కోడూరు, చిన్ననందిగామ, వెల్లటూరు భూములు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని వేయి ఎకరాల్లో విత్తనోత్పత్తి కోసం ఏడాది ఖరీఫ్ నుంచి సాగు చేపట్టేలా రైతులను సమాయత్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ వంగూరి కుమారి కెనడీ, పీఏసీఎస్ చైర్మన్ పాడిబండ్ల మధుబాబు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

ఇబ్రహీంపట్నం: మండలంలోని కాచవరం వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం కారు ఢీకొన్న ప్రమాదంలో తల్లీకుమార్తెలు నాగమణి (29), కీర్తన (4) మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గురువారం రాత్రి బంధువులు ఆందోళనకు దిగారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని కాకుండా మరో వ్యక్తిని స్టేషన్‌లో హాజరు పరిచారని ఆరోపించారు. ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మృతురాలు నాగమణి భర్త మల్లాది శ్రీకాంత్ వైద్య ఖర్చులతో పాటు కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలకు మేలు చేసేందుకే జగనన్న సురక్ష



ఈదరలో సర్టిఫికెట్లు అందజేస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



అమ్మిరెడ్డిగూడెంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి

నూజివీడు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తోందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండలం ఈదర సచివాలయం-1 పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్ సుపరిపాలనను అందిస్తుంటే టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు ఇచ్చేవన్నీ మోసపూరిత హామీలేనని, వాటిని ప్రజలెవరూ నమ్మడం లేదన్నారు. అనంతరం 473 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పి.వీరబాబు, ఎంపీపీ గోళ్ల అనూష, సర్పంచ్ దొండపాటి అనిత, డీఎల్‌డీఓ వెంకటరత్నం, తహసీల్దార్ ఉదయభాస్కర్, ఎంపీడీఓ పి.శంకర్‌రావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ఈదరలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు.

ప్రజల అవసరాలు తీర్చేందుకే జగనన్న సురక్ష

గంపలగూడెం: ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లను వారి వద్దకే వెళ్లి అందజేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెం, పెద్దకొమిర సచివాలయాల్లో గురువారం జరిగిన జగనన్న సురక్ష క్యాంపుల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అమ్మిరెడ్డిగూడెంలో 431, పెద్దకొమిరలో 472 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ జి.శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కె.శామ్యూల్, మండల ప్రత్యేక అధికారి నాగరాజు, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, ఎంఈఓ నరసింహారావు, సర్పంచ్‌లు బి.చంద్రశేఖర్, వి.కస్తూరి, సొసైటీ అధ్యక్షుడు జి.సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె.దాసులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

చాట్రాయి: పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్య లక్ష్యమని ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి పేర్కొన్నారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 324 మందికి ఉచితంగా ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ దుర్గా ప్రసాదు, మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు, వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ వజ్రాల బ్రహ్మచారి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రెడ్డిగూడెం: అర్హులందరి ముఖాల్లో చిరునవ్వే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి అన్నారు. మండలంలోని మద్దులపర్వ, కూనపరాజుపర్వ గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంజూరైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు, వైస్ ఎంపీపీ-2 పాటిబండ్ల శ్రీనివాసరావు, సర్పంచ్ వి.నాగేంద్రమ్మ, తహసీల్దార్ పాల్, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తోలుకోడులో..

మైలవరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలం తోలుకోడు పంచాయతీ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ ఓబుల్‌రెడ్డి దుర్గారెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. 796మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, సర్పంచ్ దుర్గారెడ్డి, బుర్ర ప్రతాప్, తహసీల్దారు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

జి.కొండూరు: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను వర్తింపజేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. వెల్లటూరు-2, కవులూరు-2 గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కాజా బ్రహ్మయ్యతో కలిసి ఎంపీపీ పాల్గొన్నారు. తొలుత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌లు కొండా మరియమ్మ, వేల్పూరి సుజానమ్మ, తహసీల్దార్ రోహిణీదేవి, ఎంపీడీఓ అనూరాధ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తిరువూరు: ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. మూడో సచివాలయ పరిధిలో గురువారం జగనన్న సురక్ష నిర్వహించారు. వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు ప్రకాష్‌రెడ్డి, అనురాధ, మంజుల 200 మందికి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు.

అర్హులందరికీ జగనన్న సురక్ష

ముసునూరు: అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష లక్ష్యమని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. జగనన్న సురక్ష మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన గురువారం రమణక్కపేటలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 1649 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులతో కలసి నూజివీడు రసం మామిడి మొక్కలు నాటారు.

జగనన్న సురక్షతో ఉచిత సేవలు

ఇబ్రహీంపట్నం: జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా ప్రభుత్వ సేవలు పొందొచ్చని డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మూలపాడు సచివాలయం-3లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవితో కలసి ఆయన పాల్గొన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న 11 రకాల సేవలు పొందొచ్చన్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, సర్పంచి చింతల భూలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రాధ, ఉపసర్పంచి సాంబశివరావు పాల్గొన్నారు. గుంటుపల్లి -3లో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, ఎంపీడీఓ రామకృష్ణనాయక్, సర్పంచి భుక్యా కవిత సర్టిఫికెట్లు అందజేశారు. కొండపల్లి-3, ఇబ్రహీంపట్నం-3లో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ ఎం.సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

తిరువూరురూరల్ మండలంలో..

తిరువూరురూరల్: మండలంలోని ఎర్రమాడులో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లను స్థానికంగానే అందజేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దారు సురేష్‌బాబు, ఎర్రమాడుసర్పంచి బొర్రా మాధవి, వైస్ ఎంపీపీ గద్దె రాధాకృష్ణ పాల్గొన్నారు. కోకిలంపాడులో ఎంపీపీ గద్దల భారతి, సర్పంచి రాధారుక్మిణి పాల్గొన్నారు. ఈ రెండు గ్రామాల్లో వెయ్యి మందికి వివిధ ధ్రువపత్రాలు జారీచేశారు.

విస్సన్నపేట మండలంలో..

విస్సన్నపేట: అర్హులైనా తగిన సర్టిఫికెట్లు లేక సంక్షేమ పథకాలు అందని వారికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమని జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని పుట్రేల సచివాలయం -2 వద్ద, కొర్లమండ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ కారుమంచి స్వాతి, సొసైటీ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ దామోదరరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ఏ.కొండూరు: జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ వై.వి.ప్రసన్నలక్ష్మి సూచించారు. మండలంలోని కృష్ణారావుపాలెం, మాధవరం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణారావుపాలెం గ్రామంలో ఆర్డీఓ పాల్గొని ప్రసంగించారు. జెడ్పీటీసీ భూక్య గనియా, సర్పంచులు పి.నాగమల్లేశ్వరి, జె.జమలమ్మ, కె.వెంకటసీత, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



మూలపాడులో సర్టిఫికెట్ అందజేస్తున్న డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీదేవి



సర్టిఫికెట్ అందజేస్తున్న ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

పెద్దకొమిర(గంపలగూడెం): ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలను, సేవలను చేరువ చేసిన ఘనత దేశంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి పేర్కొన్నారు. గంపలగూడెం మండలం పెద్దకొమిర సచివాలయం పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. అధికారులను, ప్రజాప్రతినిధులను వెంటబెట్టుకొని గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధిదారులకు అందిన ప్రయోజనాన్ని వివరించి ముద్రించిన బ్రోచరు అందజేశారు. రాష్ట్రంలో రాజకీయాలకు తావులేకుండా సంక్షేమ అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే 2024 ఎన్నికల్లో ప్రజలు మరో పర్యాయం వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ జి.శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చావా వెంకటేశ్వరరావు, వై.చిన్నరామిరెడ్డి, కోట లక్ష్మీనారాయణ, అనుమోలు కృష్ణారావు, బరింకెల చిన్న అంజియ్య, మందడపు వెంటేశ్వరరావు, ఇడుపులపాటి రాంబాబు, వేముల సీతారామయ్య, గొరసాని భాస్కర్‌రెడ్డి, నల్లగట్ల బాలు, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పటిష్టంగా బాలికా సంరక్షణ చట్టాలు



సదస్సులో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

తిరువూరు: రాష్ట్రప్రభుత్వం బాలికా సంరక్షణకు పటిష్ట చట్టాలను అమలు చేస్తోందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు వివిధ చట్టాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా క్షేత్రస్థాయిలో సైతం బాల్యవివాహాలు, బాలకార్మికులు, బాలికల ట్రాఫికింగ్ వ్యవస్థలను గుర్తించి నిరోధించడానికి సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. మహిళా, శిశు సంరక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలే క్రియాశీలకమని, పోలీసు, రెవెన్యూ, వైద్య-ఆరోగ్య, విద్యాశాఖలతో సమన్వయ పరచుకుని చట్టాల అమలులో కీలకంగా వ్యవహరించాలని కోరారు. మిషన్ వాత్సల్య పథకం కింద అర్హులైన లబ్ధిదారుల గుర్తింపులో కూడా మార్గదర్శకాలు పాటించాలని సూచించారు. తిరువూరు ఐసీడీఎస్ సీడీపీఓ సత్యవతి అధ్యక్షతన జరిగిన సదస్సులో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

నూజివీడు: అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని 27వ వార్డులో గురువారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వార్డులో ఇంటింటికి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని ఆయా కుటుంబాలకు వివరించి ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పేద, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తోందని వివరించారు. చంద్రబాబు 2014లో 650 హామీలు ఇచ్చి నాలుగు కూడా నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచారని దుయ్యబట్టారు. రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ ప్రజలందరూ అండగా ఉండాలని కోరారు. కో-ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ గాజుల సీతాకుమారి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

సర్వ హంగులతో ప్రభుత్వ కార్యాలయాలు



ఆస్పత్రి భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

రమణక్కపేట (ముసునూరు): సకల సౌకర్యాలు, సమగ్రాభివృద్ధితో ప్రభుత్వ ఆస్పత్రులు, కార్యాలయాలను తీర్చిదిద్ది, ప్రజలకు మరిన్ని వైద్య, ఇతర సత్వర సేవలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో రమణక్కపేటలో నూతన ఆస్పత్రి, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం భవనాలను గురువారం ప్రారంభించి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.82 కోట్ల నాడు-నేడు, ఆర్‌అండ్‌బీ నిధులతో అధునాతన ఆస్పత్రి భవనం, రూ.25 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.8 లక్షలతో రైతు భరోసా కేంద్రాలు నిర్మితమై నాటి చారిత్రాత్మక ఫిర్కా గ్రామం రమణక్కపేట, నేడు సర్వాంగ సుందరంగా మారిందన్నారు. ఏలూరు డీఎంహెచ్ఓ దయాల ఆశ, ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు కె.రాజానాయన, గంగాధర్, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, సర్పంచ్ రంగు ధనలక్ష్మి గాంధీ, తహసీల్దార్ డి.సుధ, ఎంపీడీఓ పాల్గొన్నారు.

ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి

తిరువూరు: బ్యాంకు అధికారుల పేరుతో అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్, పంపే మెసేజ్‌లపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని భారతీయ స్టేట్‌బ్యాంకు సీనియర్ మేనేజర్ రజని సూచించారు. స్థానిక ఎస్‌బీఐ ప్రధాన శాఖలో గురువారం సాయంత్రం ఖాతాదారుల సమావేశం జరిగింది. ఇటీవల జరుగుతున్న సైబర్ క్రైంలో బాధితులు ఎక్కువ మంది బ్యాంకు ఖాతాదారులే ఉంటున్నారని, ఇటువంటి కాల్స్, మెసేజీలు బ్యాంకు ఎట్టిపరిస్థితుల్లోనూ పంపదని రజని స్పష్టం చేశారు. తిరువూరు ఎస్‌బీఐ శాఖలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను పలువురు ఖాతాదారులు తెలియజేశారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మేనేజర్ జయరాజు తెలిపారు. బ్యాంకు న్యాయ సలహాదారు కంచర్ల ముత్యప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా వండి వడ్డించాలి



భోజనం వడ్డిస్తున్న మెర్సీవనజాక్షి, స్వాతి

పుట్రేల (విస్సన్నపేట): ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచిగా, శుభ్రంగా వండి వడ్డించాలని ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి సూచించారు. పుట్రేల జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీపీ, సర్పంచ్ కారుమంచి స్వాతి గురువారం పరిశీలించారు. లెమన్ రైస్‌ను రుచిచూసి వంట ఏజెన్సీలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఇటీవల అన్నం సరిగా ఉడకలేదని విద్యార్థులు చెబితే , తింటే తినండి లేకపోతే లేదు అన్నారంట' ఏమిటని నిలదీశారు. విద్యార్థులకు రుచిగా వంట చేసి వడ్డించాలని స్పష్టం చేశారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని ఎంపీపీ హెచ్చరించారు.

ఏపీఎంగా బాధ్యతలు చేపట్టిన బాబు

ముసునూరు: వైఎస్సార్ క్రాంతి పథం (వెలుగు) ముసునూరు మండల సమాఖ్య ఇన్‌చార్జ్ ఏపీఎంగా సీనియర్ సీసీ కుంటం బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ నుంచి ఆదేశాలు రావడంతో గత ఏపీఎం దయాల రాజశేఖర్ నుంచి ఆయన బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన బాబును మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల సమాఖ్య సభ్యులు అభినందించారు.

● తిరువూరురూరల్: మల్లేలలో గురువారం పెంపుడు కుక్కల దినోత్సవాన్ని నిర్వహించారు. పది పెంపుడు కుక్కలకు వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి ఎం.గోపాలకృష్ణ టీకాలు వేశారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషిచేయాలి



తోటమూలలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి తదితరులు



నూజివీడులో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



మైలవరం ఎమ్మెల్యే కార్యాలయంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నాయికులు

తోటమూల(గంపలగూడెం): బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని తిరువూరు శాసనసభ్యుడు కొక్కిలిగడ్డ రక్షణనిధి సూచించారు. గంపలగూడెం మండలం తోటమూల వై-జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ గంపలగూడెం మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే రక్షణనిధి మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు మరువలేనివన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, ఎంపీపీ జి.శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్, నాయకులు సీహెచ్ నర్సారెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి, మాజీ ఎంపీపీ కోట దాసు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

మైలవరం: బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాత యూనియన్ బ్యాంక్ సెంటర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం మండలంలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మాజీ ఉప ప్రధాని జగజ్జీవన్‌రామ్ వర్ధంతిని ఇబ్రహీంపట్నం, కొండపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం నిర్వ హించారు. కొండపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయం, బీకాలనీ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళ్లర్పించారు. టౌన్ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, భట్టరాజ కార్పొరేషన్ డైరెక్టర్ పోరంకి పద్మావతి, కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, నాగరాజ కుమారి, వెంకయ్యనాయుడు, దయాసాగర్ పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలో పీఏసీఎస్ చైర్మన్ మునగాల శివారెడ్డి, లంకే అంకమోహనరావు, కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మీ, ప్రసన్నబోసు, ఎన్.శివశంకరరావు, చిన్నయ్య, ఎన్.ప్రకాష్ పాల్గొన్నారు.

దేశం గర్వించదగిన నేత బాబూజగ్జీవన్‌రామ్

నూజివీడు: బాబూజగ్జీవన్‌రామ్ దేశం గర్వించదగిన నాయకుడని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రతాప్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల మాధవి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు లాం ప్రసాదరావు, వైస్ చైర్మన్లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు బొబ్బిలి సాయిబాబు, పిళ్లా చరణ్ తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో కేవీపీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో మాజీ ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. కేవీపీఎస్ నాయకుడు మేకల జ్ఞానరత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం ఎమ్మెల్యే కార్యాలయంలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, వైస్ ఎంపీపీ వేమూరి సురేష్, గొల్లపూడి వైఎస్సార్ సీపీ కన్వీనర్ గంగవరపు శివాజి తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు మండలంలో..

ముసునూరు: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్‌కు పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. లోపూడి, రమణక్కపేటల్లో జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ పాల్గొని జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. కాట్రేనిపాడులో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కంబాల రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు దళిత నేతలు జగ్జీవన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.